క్లుప్తంగా

కోటదుర్గమ్మను దర్శించుకున్న ఐసీఏఎస్



అమ్మవారి ఆలయంలో ప్రియాంక నశీవా, హిందూరావు దంపతులు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మను కంట్రోల్ జనరల్ ఆఫ్ అకౌంట్ అధికారిణి ప్రియాంక నశీవా, ఆమె భర్త హిందూరావుతో పాటు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి మురళీకృష్ణ వీరికి ఆలయ మర్యాదలతో సాదరంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరితో పాటు సీఐ మురళీధర్ ఉన్నారు.

జట్టు ట్రస్టుకు రూ.5లక్షల విరాళం



విరాళాన్ని అందజేస్తున్న పాత్రేరు సూర్యప్రకాష్‌రావు

గరుగుబిల్లి: తోటపల్లిలో నిర్మాణంలోవున్న జట్టు ట్రస్టు భవన నిర్మాణానికి విశ్రాంత అధ్యాపకుడు పాత్రేరు సూర్యప్రకాష్‌రావు తన వంతుగా రూ.5లక్షల విరాళాన్ని జట్టు ట్రస్టీ డి.పారినాయుడుకు బుధవారం అందజేశారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాలలో నివసించే ప్రజల కోసం నిజాయితీగా పని చేస్తున్న ట్రస్టుకు విరాళాన్ని ఇవ్వాలని నిర్ణయించడం జరిగిందని దాత సూర్యప్రకాష్‌రావు అన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు తన ఔదర్యాన్ని చూపుతూ ట్రస్టుకు ఇవ్వడం ఎంతో గర్వంగా ఉందని ట్రస్టీ పారినాయుడు కొనియాడారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కొండచిలువ హతం

వీరఘట్టం: మండలంలోని చిట్టపులివలస గ్రామంలోకి చొరబడిన పది అడుగుల కొండచిలువను బుధవారం గ్రామస్తులు హతమార్చారు. గ్రామానికి సమీపంలో ఉన్న నాగావళి నది నుంచి గ్రామంలోకి వచ్చిన పాము ఓ ఇంటి వద్ద కోడిపుంజును మింగబోయి గ్రామస్తుల కంటపడింది. దీంతో భయాందోళకు గురైన గ్రామస్తులు కొండచిలువను హతమార్చారు.

విద్యార్థులకు పర్యావరణ పాఠాలు



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఆర్‌వైఎస్ఎస్ రాష్ట్ర సిలబస్ కన్సల్టెంట్ డా.డిపారినాయుడు

గరుగుబిల్లి: విద్యార్థులకు పూర్వ ప్రాథమిక పాఠశాలల నుంచి యూనివర్సిటీ వరకు పాఠ్యాంశాలలో పర్యావరణ పాఠాలు అవసరాన్ని ప్రభుత్వం గుర్తించి, ఆ దిశగా అడుగులు వేస్తుందని ఆర్‌వైఎస్ఎస్ రాష్ట్ర సిలబస్ కన్సల్టెంట్ డా.డిపారినాయుడు అన్నారు. మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్టు ప్రాంగణంలో రచయితలు, ఉపాధ్యాయులు, విషయ పరిజ్ఞానులతో జరుగుతున్న వర్క్‌షాప్‌లో ఆయన బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రక్రియల్లో తయారు చేసిన పర్యావరణ, వ్యవసాయ పాఠాలు రాష్ట్ర విద్యా శాఖ సమన్వయంతో రెగ్యులర్ పాఠశాలలో ప్రవేశపెట్టే ప్రయత్నం జరుగుతుందన్నారు. ప్రస్తుత వర్క్‌షాప్‌లో పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యతో చేర్చవలసిన అంశాలు గురించి తయారుచేయడం జరిగిందన్నారు. రాబోయే రోజులలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కళాశాలల్లో, యూనివర్సిటీలలో చేర్చవలసిన అంశాలపై వర్క్‌షాప్‌ను నిర్వహించాల్సి వుందన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు బి.ఉమామహేశ్వరరావు, ఆర్.వాసుదేవరావు, ఎల్.వెంకటస్వామి, కె.దాలినాయుడు, బి.శంకరరావు, డా.ఎం.శ్రీరాములు, పి.గౌరీశంకర రావు, టి.శివాజీ, ఎస్.బాలకృష్ణ, ఎ.కైలాసరావు, డి.గోవిందరావు పాల్గొన్నారు.

పిల్లలు బడిలోనే ఉండాలి : డీఈఓ

పాలకొండ: బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓలతో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముఖ్యంగా స్టేట్ ఎడ్యుకేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే పక్కాగా నిర్వహించాలని సూచించారు. నాడు–నేడు ఫేజ్–2 పనులు త్వరగా పూర్తి చేయించాలన్నారు.

ప్రతీ గడపకు 'సంక్షేమం'



గడప గడపకు కార్యక్రమంలో ప్రజలకు బుక్‌లెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

• ఎమ్మెల్యే కళావతి

పాలకొండ రూరల్: రాష్ట్రంలో ప్రతీ గడపకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. పాలకొండ మండలలం అరదలి, వీపీ రాజుపేట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచులు గుణుపూరు శివ, యందవ పుణ్యవతితో కలిసి ఇంటింటికి వెళ్లారు. గడిచిన నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల ఫలాలను వివరించారు. సంబంధిత బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ క్రమంలో స్థానికులు తాగునీరు, వీధి కాలువలు వంటి సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. సమస్యలను సానుకూలంగా విన్న ఆమె సంబంధిత అధికారులకు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జీజీఎం నిధుల ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. సకాలంలో పనులు చేపట్టాలని, ప్రజాప్రతినిధులు స్వయంగా పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామన్నారు. ఎంపీపీ బొమ్మాళి భాను, వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనిల్‌కుమార్, నాగవంశపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నల్లి శివప్రసాద్, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లే-అవుట్లు



లే-అవుట్లు వేస్తున్న వారికి వీరఘట్టం పంచాయతీ ఈఓ జారీ చేసిన నోటీసు

వీరఘట్టం: మండల కేంద్రంలో ఇటీవల కాలంలో అక్రమ లేఅవుట్లు ఇష్టారాజ్యంగా వెలుస్తున్నాయి. అధికారులు నిబంధనల పేరిట నోటీసులు జారీ చేసిన రియల్టర్లు వాటిని బేఖాతరు చేస్తున్నారు. నాలా కన్వర్షన్ లేకుండా కొందరు పంట పొలాలను చదును చేస్తుండగా, మరికొందరు ఏకంగా ఎటువంటి అనుమతులు లేకుండానే రియల్ వ్యాపారానికి తెర తీస్తున్నారు. బ్రోకర్లను ఏర్పాటు చేసుకుని భూమి ధరలను అమాంతం పెంచి దోచేస్తున్నారు. వీరఘట్టం – పాలకొండ రోడ్డులో 289 – 2, 290 – 2, 291 – 3బీ సర్వే నంబర్లలో ఉన్న 1.26 ఎకరాల భూమిలో ఓ వ్యాపారి బుధవారం కొలత రాళ్లు పాతి సైట్లు వేశారు. దీన్ని గుర్తించిన వీరఘట్టం పంచాయతీ ఈఓ రామచంద్రరావు సంబంధిత యజమానికి నోటీసులు జారీ చేశారు. లేఅవుట్లు వేసేందుకు సుడా అనుమతులు ఉండాలని, 40 అడుగుల రోడ్డు తప్పనిసరిగా ఉండాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఇదొక్కటే కాదు..

వీరఘట్టం, నడుకూరు గ్రామాల సమీపంలో ఎక్కువగా అక్రమ లే అవుట్లు వేస్తున్నారు. అంతే కాకుండా ఈ రియల్ ఎస్టేట్ భూములకు సమీపంలో ఉన్న ప్రభుత్వ పోరంబోకు భూములను రియల్ ఎస్టేట్స్‌లో కలిపేస్తూ భూ ఆక్రమణలకు తెగబడుతున్నారు. అధికారులు చూస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో రియల్ వ్యాపారం జోరందుకుంది. సుడా అనుమతులు లేకుండానే లే అవుట్లు వేసి అడ్డుగోలు భూ వ్యాపారానికి తెరతీసారు. సుడా అధికారులు కూడా వస్తున్నారు, చూస్తున్నారు, వెళ్లిపోతున్నారే తప్ప ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో వీరఘట్టం పరిసర ప్రాంతాల్లో భూ దందా జోరందుకుంది.

అంతర పంటలతో అధిక ఆదాయం



దుద్దుఖల్లులో అంతర పంటలను పరిశీలిస్తున్న డీపీఎం

గుమ్మలక్ష్మీపురం: అంతర పంటలతో అధిక ఆదాయం పొందవచ్చని ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం పి.షన్ముఖరాజు అన్నారు. మండలంలోని దుద్దుఖల్లు గ్రామానికి చెందిన పలువురు రైతులు పత్తి పంటలలో సాగు చేస్తున్న అంతర పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన పంటలతో పాటు అంతర పంటలు, మిశ్రమ పంటలు వేసుకోవడం వలన అదనపు ఆదాయం కలగడమే కాకుండా మొక్కలలో జీవ వైవిద్యం, సేంద్రీయ కర్బన శాతం పెరుగుతుందని, పర్యావరణాన్ని కాపాడుకోగలుగుతామని అన్నారు. రైతులంతా అంతర పంటలు, మిశ్రమ పంటలు వేసుకొని ప్రయోజనం పొందాలని సూచించారు. ఆయన వెంట ఏపీసీఎన్ఎఫ్, జట్టు సిబ్బంది పాల్గొన్నారు.

30 నుంచి సీపీఎం బస్సు యాత్ర



మాట్లాడుతున్న పార్టీ జిల్లా కార్యదర్శి వేణు

సీతంపేట: సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి బస్సు యాత్ర చేపట్టనున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు వెల్లడించారు. సీఐటీయూ స్థానిక కార్యాలయంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఎ.భాస్కరరావు అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఈ యాత్ర ఉంటుందన్నారు. బస్సు యాత్రకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వం వహిస్తారన్నారు. సీతంపేట నుంచి ఈ యాత్ర ప్రారంభం అవుతుందని తెలిపారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రూ.34 లక్షలతో తాగునీటి వసతులు

• ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రవీణ్



పాత నిగరాంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌ను పరిశీలిస్తున్న జేఈ

గుమ్మలక్ష్మీపురం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల్లోని రూ.34 లక్షలతో గుమ్మలక్ష్మీపురం మండలంలో 11 గ్రామాల్లో తాగునీటి వసతులు కల్పిస్తున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రవీణ్ తెలిపారు. మండలంలోని పాతనిగరాం గ్రామంలో జల్ జీవన్ మిషన్‌లో భాగంగా రూ.4.30 లక్షలతో ఏర్పాటు చేసిన ఇంటింటికి కుళాయి కనెక్షన్లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ వచ్చిన వినతులకు స్పందించిన కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ఆయా పనులు సకాలంలో పూర్తయ్యేలా చొరవ చూపాలని సూచించారని తెలిపారు. 11 గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు పనులు ప్రారంభించగా ఇప్పటి వరకు లక్కగూడ, లుంబేసు, మూలజమ్ము, కప్పలవలస, లప్పటి, గుమ్మలక్ష్మీపురం గ్రామాల్లో తాగునీటి వసతులు కల్పించామన్నారు. మిగతా గ్రామాల్లో పనులు పలు దశల్లో ఉన్నాయని, వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేయనున్నట్టు జేఈ తెలిపారు.

గ్రానైట్ రాయి పడి వ్యక్తికి గాయాలు

జియ్యమ్మవలస: పెదమేరంగి కూడలి వద్ద గ్రానైట్ పలక వ్యక్తిపై పడి కాలుకు తీవ్ర గాయమైంది. స్థానికులు తెలిపిన వివరాలు.. బుధవారం మధ్యాహ్నం గవరమ్మపేట నుంచి కురుపాం మండలం గొయ్యిపాక గ్రానైట్ పలకలు తీసుకువెళ్తుండగా పెదమేరంగి కూడలి వద్ద రహదారి గతుకులకు వ్యాన్‌లోనే ఉన్న ఇద్దరు వ్యక్తులపై పలకలు పడడంతో మీసాల ఆనంద్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కాలు పూర్తిగా విరిగిపోయింది. 108 సిబ్బంది పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం తీసుకువెళ్తున్నట్టు తెలిపారు.

అవగాహనతో ప్రమాదాలకు అడ్డుకట్ట



అగ్ని ప్రమాదాలను అధిగమించటంపై అవగాహన కల్పిస్తున్న అధికారి

పాలకొండ రూరల్: అవగాహనతో అగ్నిప్రమాదాలకు అడ్డుకట్ట వేయొచ్చని పాలకొండ అగ్నిమాపక అధికారి జె.సర్వేశ్వరరావు అన్నారు. తమ్మినాయుడు విద్యా సంస్థల్లో అగ్ని ప్రమాదాలతో బుధవారం ప్రత్యేక డెమో నిర్వహించారు. ఈ సందర్భంగా అనుకోని అగ్నిప్రమాదాలు సంభవిస్తే చేపట్టాల్సిన మెలకువలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ప్రమాదాల నుంచి తోటి వారిని రక్షణ కల్పించే మెలకువలపై తర్ఫీదు ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు పూర్తి చేయాలి



బత్తిలిలో భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీఈఈ, ఏఈ

భామిని: గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్ర భవనాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభాలకు సిద్ధం చేయాలని పీఆర్ డీఈఈ దారపు లోకనాథం అన్నారు. పీఆర్ ఏఈఈ పి.గౌరీశంకర్, ఎంపీటీసీ టింగ అన్నాజీ రావుతో కలిసి డీఈఈ భామిని మండలంలో బుధవారం పర్యటించారు. సచివాలయ భవనాల నిర్మాణాలు పరిశీలించారు. ఇప్పటికే పనులు పూర్తి చేసిన మేరకు బిల్లులు చెల్లింపులు జరిగాయని, తక్షణమే భవన నిర్మాణాలు పూర్తి చేస్తే ప్రారంభానికి నోచుకొని బిల్లు చెల్లింపులు త్వరితగతిన సాగుతాయన్నారు. బత్తిలి, నేరడి-బి, బొడ్డగూడ, నల్లరాయిగూడ గ్రామాల పరిధిలో భవన నిర్మాణాలను పరిశీలించి నిర్మాణ కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు.

అధికారుల తీరు సరికాదు..

కురుపాం: మండల కేంద్రంలోని సాయిబాబా గుడి దగ్గర గల సర్వే నంబరు 27–2లో 60 సెంట్లు భూమిలో అధికారులు ప్రభుత్వ భూమి అంటూ బోర్డు పెట్టడం సరికాదని ఆ భూమి యజమానులు చిలకల వెంకటమ్మ, చిలకల సత్యం ఆవేదన వ్యక్తం చేసారు. బుధవారం వారు మాట్లాడుతూ 30 సంవత్సరాల కిందటే తాము గదబ కులానికి చెంది ఆర్థికంగా వెనుకబడి ఉండటంతో ప్రభుత్వం పట్టాను అందజేసిందని, అప్పట్లో రెండు ఎకరాలు పట్టాను ఇస్తామని 60 సెంట్లు మాత్రమే అందజేసారన్నారు. పత్తి పంటను, కూరగాయలను సాగు చేసుకొనే వాళ్లమని ప్రస్తుతం కొన్ని నెలలుగా అనారోగ్య కారణాల వలన సాగు చేయటం లేదని తెలిపారు. అంత మాత్రాన అధికారులు ప్రభుత్వ భూమని బోర్డు పెడితే సరికాదని అధికారులు వాస్తవాలు గుర్తించాలని కోరారు. తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని తెలిపారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

వైభవంగా దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాలు



జియ్యమ్మవలస: అన్నపూర్ణదేవి అవతారంలో దుర్గాదేవి



భామిని: మహాలక్ష్మీ అలంకరణలో బత్తిలి త్రిపుర సుందరీదేవి



పాలకొండ: మహాలక్ష్మీ అలంకరణలో కోటదుర్గమ్మ

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో నెలకొల్పిన దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం అన్నపూర్ణదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం అన్న సమారాధన జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మహాలక్ష్మి రూపంలో..

భామిని: దసరా నవరాత్రుల్లో భాగంగా దుర్గాదేవి బుధవారం మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. బత్తిలి శ్రీలలిత త్రిపుర సుందరీ దేవి ఆలయంలో మాతా మూల విరాట్‌ను సుందరంగా అలంకరించి కుంకుమ పూజలు చేశారు. దిమ్మిడిజోలలో దుర్గామాత సన్నిధిలో మాహాలక్ష్మి పూజలు నిర్వహించారు.

మహాలక్ష్మి అలంకరణలో కోటదుర్గమ్మ

పాలకొండ: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం కోటదుర్గమ్మ బుధవారం మహాలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు జరిపించారు. దసరా రోజులు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి ఘటాలతో మొక్కులు తీర్చుకున్నారు.

కురుపాంలో...

కురుపాం: మండల కేంద్రంలోని రావాడ కూడలిలో వెలసిన కోటదుర్గమ్మ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అన్నపూర్ణదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. చండీయాగం నిర్వహించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కురుపాం: కోటదుర్గమ్మ ఆలయం వద్ద చండీయాగంలో పాల్గొన్న భక్తులు



భక్తులతో రద్దీగా మారిన గారమ్మ ఆలయ ప్రాంగణం

గారమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

పాలకొండ రూరల్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక అగ్నిమాపక కేంద్రం సమీపంలో కొలువైన పాలకొండ గ్రామదేవత, ఈ ప్రాంత ప్రజల ఇలవేల్పు గారమ్మ ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. బుధవారం రాత్రి పట్టణ పరిధిలోని కాపువీధులతో పాటు వేలాదిగా భక్తులు సామూహిక ఘటాలతో ఈ ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి చల్లదనం చేపట్టారు. నూతన ఆలయం నిర్మాణ దశలో ఉండటంతో ఈ ప్రాంగణం భక్తజన సంద్రంగా మారింది. భక్తుల తాకిడితో ఆ ప్రాంతంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

సవర భాషలో టీఎల్‌ఎం

సీతంపేట: తెలుగు వాచక పుస్తకంలోని పదాలను సవర భాషలో చెప్పి నేర్పించేందుకు భాష వలంటీర్లు బుధవారం వృత్యంతర శిక్షణలో టీఎల్‌ఎం మెటీరియల్ తయారు చేశారు. ఈ సందర్భంగా స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో భాష వలంటీర్ల శిక్షణ కార్యక్రమంలో ప్రదర్శించారు. డిప్యూటీ ఈఓ లిల్లీరాణి మాట్లాడుతూ తయారు చేసిన మెటీరియల్‌తో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓ కోటిబాబు, సీఎంఓ చిరంజీవి, జీసీడీఓ రాములమ్మ, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

యాప్‌లో వివరాలు పొందుపర్చాలి



లోకోస్ యాప్‌లో నమోదును పరిశీలిస్తున్న ఏపీఎం

గుమ్మలక్ష్మీపురం: డ్వాక్రా సంఘాల సభ్యుల వివరాలు లోకోస్ యాప్‌లో పొందుపర్చాలని వైకేపీ ఏపీఎం ఆదయ్య సూచించారు. వైకేపీ కార్యాలయం వద్ద వీఓఏలు చేపడుతున్న లోకోస్ యాప్ నమోదులను ఆయన బుధవారం పరిశీలించారు. మండలంలో మొత్తం 959 డ్వాక్రా సంఘాలున్నాయని, వాటిలో మొత్తం 11,063 మంది సభ్యులుండగా, ఇప్పటి వరకు 274 డ్వాక్రా సంఘాలకు చెందిన 2,867 మంది సభ్యుల యొక్క వివరాలను లోకోస్ యాప్‌లో పొందుపరిచారని తెలిపారు. ఆయన వెంట సీసీలు పి.నాగభూషణరావు, పి.నాగేశ్వరరావు, ఎస్‌సీ గోపాల్, సూర్యనారాయణ, సంజయ్‌కుమార్, టీటీఎస్ ప్రసాద్, దాశరధి, ఎస్.రాజారావు తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: మండలంలోని జిల్లేడుపాడు గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్థిక సాయంతో రూ.10 లక్షలతో నిర్మించనున్న గ్రామ దేవత ఆలయానికి పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ దేవత ఆలయాన్ని త్వరితగతిన నిర్మించాలని సూచించారు. తమ గ్రామానికి ఆలయం మంజూరు కావడంపై గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతిరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఆర్థిక భరోసా

• జెడ్పీ వైస్ ఛైర్మన్ మరిశర్ల



చేప పిల్లలను విడిచిపెడుతున్న జెడ్పీ వైస్ ఛైర్మన్ మరిశర్ల, ఎంపీపీ రామారావు

గరుగుబిల్లి: మత్స్యకారులకు ఆర్థిక భరోసాను కలిపించడమే లక్ష్యంగా రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఎంపీపీ ఉరిటి రామారావు అన్నారు. మండలంలోని పెదగుడబ పంచాయతీ ఎస్ఆర్‌పేటలోని గంగసాగరం చెరువులో చేప పిల్లలను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్య శాఖ పరిధిలో డిపార్ట్‌మెంట్ చెరువులలో మత్స్యశాఖ సంఘాలకు, బీసీ సంఘాలకు 40శాతం సబ్సిడీతో, ఎస్టీ సంఘాలకు 60శాతం సబ్సిడీతో చేప పిల్లలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా మత్స్యశాఖాధికారి వి.తిరుపతయ్య మాట్లాడుతూ ఎస్ఆర్ పేటలోని గంగసాగరంలో 28వేలు చేపపిల్లలను, వెంగాపురం, అజ్జాడ, నారాయణపురం, బలిజిపేట మండలాల్లోని 10 చెరువులలో 1.40 లక్షల చేప పిల్లలు విడిచిపెట్టనున్నట్టు తెలిపారు. మత్స్యకారుల జీవనోపాధికి ఫిష్ ఆంధ్ర షాపులను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధ్యక్షుడు డి.లక్ష్మణరావు, సర్పంచ్ జాగాన సరస్వతి, మాజీ ఎంపీటీసీ ఎం.అప్పారావు, ఎఫ్‌డీఓ శ్రీదేవి పాల్గొన్నారు.

● ప్రజల చెంతకే వైద్యం

ప్రజారోగ్య భద్రతను ప్రభుత్వం తన బాధ్యతగా తీసుకుందని అందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టారని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. బుధవారం పలు చోట్ల వైద్య శిబిరాలు నిర్వహించారు. శిబిరాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



పాలకొండ రూరల్: అర్దలి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఎమ్మెల్యే కళావతి తదితరులు



వీరఘట్టం: చిట్టపులివలసలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారులు



గరుగుబిల్లి: సంతోషపురం వైద్య శిబిరంలో అందుతున్న సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ జగన్నాథరావు



కొమరాడ: వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి తదితరులు